క్లుప్తంగా

విజయవంతం చేయండి

ఖమ్మంమామిళ్లగూడెం: కరీంనగర్‌లో ఈ నెల 14న నిర్వహించే పటేల్ యూత్ గర్జన సభను విజయవంతం చేయాలని టీఎంకేజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరాకుల గోపి ఒక ప్రకటనలో కోరారు. మున్నూరుకాపులకు పటేల్ గెజిట్ సాధన, 1000 మంది విద్యార్థుల కోసం హాస్టల్ నిర్మాణం తదితర డిమాండ్ల సాధన కోసం ఈ యూత్ గర్జన సభ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డోర్ టు డోర్ క్యాంపెయినింగ్..

తిరుమలాయపాలెం: యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యాన నిర్వహించే డోర్ టు డోర్ క్యాంపెయినింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల సెక్టార్ ఇన్‌చార్జ్ గుగులోత్ సురేష్‌నాయక్ యువజన కాంగ్రెస్ నాయకులను కోరారు. శుక్రవారం యువజన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను గడపగడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ క్యాంపెయినింగ్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు శ్రమించిన యువజన నాయకులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించనున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ అంబేడ్కర్ ప్రజాసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సభలు, సమావేశాలు విరివిగా నిర్వహించాలన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో పాలన సాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

రాములోరి కల్యాణాన్ని..

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాలో శ్రీ సీతారాములు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. రామాలయంలో శుక్రవారం ఆలయ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా కల్యాణం ఉత్సవం జరపాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ భూక్యా సుధాకర్, తేజావత్ కోటేశ్వరరావు, నాగరాజు, రామచంద్ర, భూక్యా నాగేశ్వరరావు, భూక్యా సీతా, చీనా, రామారావు, నరసింహారావు, గోబ్రియా, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా స్టేజీ వద్ద అల్ హాజీ సయ్యద్ మదార్‌సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్మన్ సయ్యద్ ఇమామ్ శుక్రవారం ప్రారంభించారు. వేసవి ఎండలతో ప్రజలు తాగునీటి ఇబ్బందులను తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ ఇబ్రహీం, మోహిన్, జబ్బార్ పాల్గొన్నారు.

భరత్ మృతికి సంతాపం



భరత్ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: అఖిల భారత యువజన సమాఖ్య కార్యకర్త, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ కుమారుడు, ఏఐవైఎఫ్ నాయకుడు పగడాల భరత్‌కుమార్(23) అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌లతో పాటు యర్రా బాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్ సీతామహాలక్ష్మి, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు తదితరులు భరత్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనేపథ్యాన భరత్ మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఫోన్ ద్వారా పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అనారోగ్యంతో సీపీఐ నాయకుడి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని అవేర్ కాలనీకి చెందిన సీపీఐ నాయకుడు ఎల్.వీరాస్వామి (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట పాల్వాయి యోబు, నారపొంగు యాకూబ్, ప్రసాద్, రామారావు తదితరులున్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ది ఫ్యామిలీ స్టార్
వినోద	టిల్లు2
సాయిరాం	బడే మియా చోటే మియా
ఆదిత్య	గీతాంజలి
శ్రీనివాస	మంజుమ్మల్ బాయ్స్
సుందర్	లవ్ గురూ

- ఖమ్మంగాంధీచౌక్

పాలేరు డివిజన్‌లో ఇసుక బంగారమైంది. ఇక్కడ ఇసుక రీచ్‌లు లేనప్పటికీ వాగులు, వంకలు, ఏటి పరీవాహక ప్రాంతం నుంచి ఇసుకను తోడేస్తున్నారు. దీంతో ఇసుక కొరత ఏర్పడి ధరలు అమాంతం పెరిగిపోయాయి. కొంతమంది అధిక ధరలకు కొనుగోలు చేసి తెచ్చి ఇక్కడ విక్రయిస్తుండగా.. సామాన్యులు



ఇసుక సరఫరా చేస్తున్న ట్రాక్టర్

మాత్రం కొనే పరిస్థితి లేక తమ పనులను మధ్యలోనే నిలిపివేస్తున్నారు. వివిధ ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను కొందామంటే కొంత మంది నకిలీల దందా మితా ఎక్కువైంది. దీనికి తోడు సంబంధిత శాఖల అధికారుల తనిఖీలు చేపట్టి ట్రాక్టర్లను ఎక్కడికక్కడే సీజ్ చేస్తున్నారు. – నేలకొండపల్లి

ఇసుక.. బంగారమాయే!

ఇసుక ధరలకు రెక్కలు
- అధిక ధరలు వెచ్చించినా దొరకని పరిస్థితి
- సామాన్యులు కొనలేక మధ్యలోనే నిర్మాణాలను నిలిపివేస్తున్న వైనం
- ఎక్కువైన నకిలీ దందాలు
- అధికారుల ముమ్మర తనిఖీలు



పైనంపల్లి ఏటిలో మేటలు తేలిన ఇసుక

ట్రక్కు ధర రూ.5వేలకు పైమాటే..

పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో ఇటీవల ప్రభుత్వ, గృహ నిర్మాణాలు ఎక్కువగా సాగుతున్నాయి. డివిజన్‌లో వాగులు, వంకలు, ఏటి పరీవాహక ప్రాంతంలో ఇసుక బాగానే ఉన్నప్పటికీ రవాణా కష్టంగా మారింది. దీంతో కొంతమంది అర్ధరాత్రి వేళల్లో అక్రమార్కులు ఇసుకను రవాణా చేస్తున్నారు. ఒకప్పుడు రూ.2 వేల వరకు ఉన్న ట్రాక్టర్ ఇసుక ట్రక్కు ఇప్పుడు రూ.5 వేలకు పైగా విక్రయిస్తున్నారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం..

ముదిగొండ మండలంలో పలు ఇసుక రీచ్‌ల నుంచి భారీగా ఇసుక తరలుతోంది. ఈనేపథ్యాన అధికారులు ఎక్కడికక్కడ తనిఖీ చేసి ఇసుకను సీజ్ చేస్తుండడంతో ఇసుక కొరత ఏర్పడి ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. నేలకొండపల్లి మండలంలోని పాలేరు వాగు, ఏటి పరావాహాక ప్రాంతంలో ఇసుక ఉన్నప్పటికీ ఇటీవల ఇసుక మాఫియాలో ఉన్న వర్గాల కారణంగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో వివాదాలకు దారి తీస్తుంది. ఇటీవల తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయడంతో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన సామాన్యులకు భారంగా మారింది. ఒక పక్క సిమెంట్ ధరలు పెరిగి ఇబ్బంది పడుతుంటే మరో పక్క ఇసుక ధరలు పెరగడంతో నిర్మాణాల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది.

ఇష్టారాజ్యంగా దందాలు..

పాలేరు డివిజన్‌లో నిర్మాణాలు చేపట్టిన కొందరు పనులు ప్రారంభించి మధ్యలో ఆపలేక ధర ఎక్కువైనా.. కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారు. అయినా ఇసుక మాత్రం దొరకడం లేదు. దీనికి తోడు పలు గ్రామాల్లో ఇసుక దందాలకు పాల్పడే వారు ఎక్కువయ్యారని, ఈక్రమంలో కొంతమంది ఇసుక ట్రాక్టర్లు వెంటపడి అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇసుకను సామాన్యులకు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొనలేక పనులు ఆపాను..



ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఇసుక ధరల కారణంగా పనులు ఆపాల్సి వచ్చింది. వాసవి భవన్‌లో పనులు ప్రారంభించాం.. కానీ ఇసుక రేట్లు అమాంతం పెరగడంతో పనులు ఆపాం. ఇసుక ధరలను నియంత్రించి, అందుబాటులోకి వచ్చేలా చూడాలి.
– పసుమర్తి శ్రీనివాస్, వాసవి భవన్ అధ్యక్షుడు, నేలకొండపల్లి

చర్యలు తీసుకోవాలి..



వెంచర్లలో రహదారులు, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు ఇసుక తీసుకొచ్చేందుకు చాలా కష్టంగా మారింది. అధిక ధరలు పెట్టినా అందని పరిస్థితి ఉంది. ప్రభుత్వం నుంచి ఇసుకపై సబ్సిడీ అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– రావెళ్ల కృష్ణారావు, రియల్టర్, నేలకొండపల్లి

అనుమతి తప్పనిసరి..



మండలంలో జరిగే పలు అభివృద్ధి పనులకు ఇసుక కోసం అనుమతులు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక కూపన్లు జారీ చేస్తారు. సంబంధిత అధికారులు పనుల విషయాన్ని ధ్రువీకరించిన తర్వాతే అనుమతులు ఇస్తారు. అక్రమ రవాణాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.
– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

నగరంలో 'నామ' ప్రచారం

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు స్థానిక మైనార్టీ నాయకులతో కలిసి నగరంలోని శుక్రవారపుపేట, బీకే బజార్‌లోని మసీదుల వద్ద శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఓట్లు అభ్యర్థించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి గెలిపించాలని, పార్లమెంట్‌లో ముస్లింల సమస్యలపై మరింతగా గళం విప్పుతానని అన్నారు. నామ ప్రతీ ఒక్క ముస్లిం సోదరుడిని ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మైనార్టీ నాయకులు తాజుద్దీన్, ఫిరోజ్, ఫారూఖ్ హుస్సేన్, ఇజాద్, తౌశిఫ్, అఫ్సర్, బాబీ, మసీదు ఇమామ్ రెహ్మాన్, పార్టీ జిల్లా నాయకులు తాళ్లూరి జీవన్, నామ సేవా సమితి నుంచి రాజేష్, చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆప్యాయంగా పలకరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న నామ నాగేశ్వరరావు

కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్..



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

కామేపల్లి: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన బర్లగూడెం, గోవింద్రాల, పండితాపురం గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ఓటర్లలో విశ్వాసం నింపేందుకు సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన కేంద్ర బలగాల సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాల కవాతు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నాయుడుపేటలో కుల బహిష్కరణ

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేటలో కులబహిష్కరణ విషయంలో రూరల్ పోలీసులు శుక్రవారం ఆ కులస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నాయుడుపేటలోని గుట్టపై నివసిస్తున్న చిప్పిడి బంగారి అనే వ్యక్తిని ఆయన కులానికే చెందిన అతడి సోదరులు ఇతర కులస్తులు తన కుటుంబంతో ఎవరూ మాట్లాడకూడదని కట్టుబాటు విధించారు. దీంతో బంగారి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రామారావు గ్రామానికెళ్లి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా కులం పేరుతో కట్టుబాట్లు విధించడం, జరిమానాలు విధించడం, కుల బహిష్కరణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

వార్షిక బ్రహ్మోత్సవాల్లో సుదర్శన యాగం



సుదర్శన యాగం చేస్తున్న అర్చకులు



యాగంలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ బాలాజీనగర్‌లోని స్వయంభు శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి 20 వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుదర్శన యాగం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరగిరినాథుని రామాచార్యులు బృందం ఆధ్వర్యాన పూజలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భక్తులు దేవాలయ కమిటీ సభ్యుడు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, ప్రధాన కార్యదర్శి పురం తిరుపతయ్య, కోశాధికారి మలుసూర్‌నాయక్, గౌరవ సలహాదారులు పల్లెబోయిన చంద్రయ్య, దండా జ్యోతిరెడ్డి, మేకల వీరన్న, అల్లిక అంజయ్య, బెల్లి కొండలు, అయితేన బోయిన వెంకటేశ్వర్లు, బందు వెంకటేశ్వర్లు, గుగులోత్ మణికంఠ, అల్లిక వీరబాబు, పల్లపు సత్యం, కిషన్, దాచేపల్లి సంతోష్, ఎర్రోజు సుబ్బాచారి, గుగులోతు విజయ, సాలమ్మ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం నివేదిన, మంత్రపుష్పం పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/కామేపల్లి/రఘునాథపాలెం: నగరంలోని 33/11 కేవీ దానవాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏఈ ఆపరేషన్స్ మాలిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సారథినగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, జూబ్లీ స్కూల్ ఏరియా, జూబ్లీక్లబ్ రోడ్, ఫిష్‌హౌస్ లైన్లు, బైపాస్ రోడ్, వాటర్ వర్క్స్, గణేష్ నగర్ బోర్డు, మేకల నారాయణనగర్ బోర్డు ఏరియా, కామంచికల్, దారేడు లైన్లు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే రామాలయం 33/11 సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కమాన్‌బజార్, కస్బాబజార్, వల్లాల వారి వీధి, షాదీఖానా ఏరియా, స్టేషన్ రోడ్, బొమ్మన సెంటర్, శాంతిలాడ్జ్ ప్రాంతం, వినోద థియేటర్ ఏరియా, పాత మున్సిపాలిటీ ఆఫీస్ ప్రాంతం, ఖిల్లా, శుక్రవారపు పేట, బ్రాహ్మణ బజార్, రిక్కా బజార్, చర్చి కాంపౌండ్ ప్రాంతం, రామకృష్ణానగర్, సుగ్గలవారి తోట, మేదర బజార్, అమ్మ భవానీ టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈలు ప్రభాకర్‌రావు, ఇందిరా తెలిపారు. నగరంలోని ప్రకాష్‌నగర్, మమతా ఆస్పత్రి, 33/11 కేవీ ఎన్ఎస్‌పీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు కరెంట్ ఉండదని టౌన్-2 ఏడీఈ రమేష్, టౌన్-3 ఏఈ ఆపరేషన్స్ బి.తావుర్యా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో బైపాస్ రోడ్, కొత్త బస్టాండ్, గట్టయ్యసెంటర్, ఎన్ఎస్‌పీ, వికలాంగుల కాలనీ, రమణగుట్ట, ఆర్టీఓ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే కామేపల్లి మండలం కొత్తలింగాల 33 కేవీ సబ్ స్టేషన్‌లోని మరమ్మతుల కారణంగా కొత్తలింగాల ఫీడర్ పరిధిలోని పండితాపురం, కొత్తలింగాల, పాతలింగాల, గోవింద్రాల గ్రామాలకు శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు,రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో ఆదివారం నిర్వహించనున్న వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని నూతక్కి గంగాధర్‌రావు సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలకు రూ.100లతో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సేవా కమిటీ సభ్యులు గుడవర్తి నాగేశ్వరరావు, కేవీ.రెడ్డి, కట్టికోల వెంకన్న, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల విస్తృత పర్యటన

రఘునాథపాలెం/ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. రఘునాథపాలెం మండలం మంగ్యాతండాలో ఇటీవల ప్రారంభించిన హనుమంతుడి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. మంచుకొండ గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు షేక్ జామియా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో కాలుకోల్పోయిన రేగళ్ల సీతారాములు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు పువాళ్ళ దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు మహమ్మద్ జావీద్, కార్పొరేటర్లు మలీదు జగన్, మలీదు వెంకటేశ్వరరావు, నాయకులు గుత్తా వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే భారతీయ జీవిత భీమా సమైక్య వరంగల్ డివిజన్ ఏజెంట్ల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కార్పొరేటర్ కమర్తపు మురళీ, తుంపాల క్రిష్ణమోహన్, ప్రముఖ సామాజిక వేత్త లోడిగ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మంగ్యాతండా గుడిలో పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్

ఖమ్మంలో కాషాయం గెలుపు ఖాయం

ఖమ్మం మామిళ్లగూడెం: ఎంపీ ఎన్నికల్లో ఖమ్మంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. శుక్రవారం వినోద్‌రావు పలు డివిజన్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం సంభానినగర్, పార్శిబంధన్‌కు చెందిన మద్దినేని వెంకటేశ్వర్లు, నన్నక మధు, రామారావు ఆధ్వర్యాన అలస్యం శ్రీకాంత్, జ్యోతి, కృష్ణవేణి, ఇతర నాయకులు తాండ్రతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం వినోద్‌రావు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను చూసి ప్రజలు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నట్లు చెప్పారు. పాకబండబజార్, బ్రాహ్మణబజార్, కస్బాబజార్, బొమ్మన సెంటర్‌లలో ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించారు. కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మందా సరస్వతి, మార్తి వీరభద్రప్రసాద్, గడ్డం అశోక్, నున్నా రవి, వెంకటనారాయణ, నాగ, అల్లిక అంజయ్య, చంద్రశేఖర్, రాజేష్‌గుప్త, తదితరులు పాల్గొన్నారు.



కమాన్ బజార్‌లో ప్రచారం చేస్తున్న వినోద్‌రావు

బీజేపీ ఇంటింటి ప్రచారం, ర్యాలీ



ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు

బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఖమ్మం 52వ డివిజన్‌లో బీజేపీ మహిళలు ఇంటింటి ప్రచారం చేయగా.. కొప్పుల లక్ష్మీనర్సింహారావు, దాసరి మధు, సుధాకర్, మహిందర్‌సింగ్, దాసరిసాయి, కమల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్‌లాల్ మాట్లాడుతూ.. దేశంలో కాంగ్రెస్ కుటుంబపాలనను అమలు చేస్తామంటే ఖమ్మం ప్రజలు చాలా విజ్ఞులు అన్నారు. ఈ సమావేశంలో ఉపేందర్‌గౌడ్, కార్తీక్ వీరభద్రం, శ్రీనివాస్, రవితేజ, నాగ, సురేందర్‌రెడ్డి, గోపి, లక్ష్మారెడ్డి, శేఖర్, రామారావు, పరుశురాం, రాహుల్‌నాయక్, హరికృష్ణ, మోయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు. అంతేకాక బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం గిరిజన డప్పులు, నృత్యాలతో ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియం నుంచి పార్టీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమ్మేళనంలో కమల్ ఫూల్ మత్ భూలో అని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్ పేర్కొనగా.. దొడ్డా అరుణ, శ్రీనునాయక్, నున్నా రవి, నాగేశ్వరరావు, ఉపేందర్, మోహన్, లక్ష్మణ్‌నాయక్, లచ్చిరాం, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ప్రతిమల బహూకరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల నూతన దేవాలయానికి శుక్రవారం దాతలు గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రతిమలను బహూకరించారు. రజత రాక్స్ గ్రానైట్స్ యజమానురాలు తూము విజయరాణి కుటుంబసభ్యులతో కలిసి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే పాటి శ్రీనివాసరావు, సునిత దంపతులు కుందులను వితరణగా అందించారు.



ప్రతిమలను బహూకరిస్తున్న దాతలు

గాలికుంటు టీకా నాణ్యత పరిశీలన



టీకాను పరిశీలిస్తున్న పశు వైద్యులు

ఖమ్మంరూరల్: పశువులకు గత 21 రోజుల క్రితం వేసిన గాలికుంటు టీకా నాణ్యత, దాని పనితీరును మండలంలోని దారేడు, పడమటితండాల్లో శుక్రవారం జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకురాలు డాక్టర్ అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గాలికుంటు టీకా వేసిన 21 రోజుల తర్వాత పశువులకు ఆ టీకా పనితీరు ఏ విధంగా పనిచేస్తుందని పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం 13 పశువుల నుంచి రక్తనమూనాలు సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ హరీష్, ఇంటర్న్‌షిప్ స్టూడెంట్స్ జూనియర్ డాక్టర్లు మహేష్, వైష్ణవి, సిబ్బంది శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి రూ.600 ఇవ్వాలి



కూలీలతో మాట్లాడుతున్న బందెల వెంకయ్య

తిరుమలాయపాలెం: ఉపాధి కూలీలకు రోజుకు రూ.600లు ఇవ్వాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా), అనుబంధ అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏ.ఐ.పీ.కే.ఎం.ఎస్) తెలంగాణ రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని హస్నాబాద్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి ప్రతీ ఒక్కరు హక్కులకై పోరాడాలన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలతో పాటు మెడికల్ కిట్లు, ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని,కుటుంబంలో ఒకరికి ఉద్యోగ, లైఫ్ ఇన్సూరెన్స్ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కొలతలు లేకుండా వేతనం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కూలీ వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తిమ్మిడి హన్మంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, పసలాది వెంకన్న, కొత్తపల్లి వెంకటరెడ్డి, తండ అంజయ్య, నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పాపిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

కామేపల్లి: తాళ్లగూడెం గ్రామంలోని శ్రీ తిరుపతమ్మ తల్లి దేవాలయంలో శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మతల్లి కల్యాణం జరిగి 16 రోజులైన సందర్భంగా శుక్రవారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. మేళతాళాలతో మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాలతో వస్తున్న గ్రామస్తులు